
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
3
ఆదివారం 28 జనవరి 2024



మంచిర్యాల-అంతర్గాం వంతెన
స్థలం మార్పు..?


వంతెన నిర్మాణం కోసం సాయిల్ టెస్ట్ (ఫైల్)

- ఇప్పటికే పూర్తయిన సాయిల్ టెస్టింగ్
- కాలేజీ రోడ్డు నుంచి కాకుండా ముల్కల్ల వద్ద యోచన
- టెండర్ పూర్తయిన అనంతరం పునరాలోచన

మంచిర్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల-అంతర్గాం మధ్య గోదావరిపై వంతెన నిర్మాణం డోలాయమానంలో పడింది. గోదావరిపై వంతెన నిర్మించాల్సిన ప్రాంతంలో ఆర్‌అండ్‌బీ అధికారులు సర్వే జరిపి సాయిల్ టెస్టింగ్ ప్రక్రియ కూడా పూర్తయింది. 2018లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం శ్రీరాంపూర్ బహిరంగ సభకు హాజరైన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ హామీలో భాగంగా వంతెన నిర్మాణానికి మోక్షం లభించింది. మొదట రూ.125 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసిన ప్రభుత్వం అనంతరం దానిని రూ.165 కోట్లకు పెంచుతూ జీవో జారీ చేసింది. వంతెన నిర్మాణం పూర్తయితే మంచిర్యాల-పెద్దపల్లి జిల్లాల మధ్య దూరభారం తగ్గనుంది. కరీంనగర్ వైపు వెళ్లేందుకు గోదావరిఖని మీదుగా ప్రయాణించాల్సి రావడంతో ప్రయాణికులకు తలెత్తున్న ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

పూర్తయిన సాయిల్ టెస్టింగ్

గోదావరి వంతెనకు సంబంధించి ఇప్పటికే టెండరింగ్ ప్రక్రియ పూర్తి కాగా కాంట్రాక్టర్‌కు అగ్రిమెంట్ కూడా చేశారు. టెండర్ ప్రక్రియ ముగియడంతో అధికారులు సర్వే పనులు చేపట్టారు. ప్రభుత్వం అంచనా వ్యయం కోసం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ పూర్తయిన నాటి నుంచి గరిష్ఠంగా సంవత్సర కాలంలో వంతెనను నిర్మించాల్సి ఉంది. వంతెన నిర్మాణంలో భాగంగా జిల్లా కేంద్రంలోని గోదావరి నది వద్ద ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ భావ్‌సింగ్ ఆధ్వర్యంలో అధికారులు సర్వే నిర్వహించారు.

ఆందోళనల మధ్య వంతెన మంజూరు

గోదావరిపై వంతెన నిర్మిస్తామని కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ప్రజ లు ఆందోళన బాట పట్టారు. గోదావరి వంతెన సాధన సమితి పేరుతో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటయ్యాయి. మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు వంతెన నిర్మాణానికి చొరవ చూపారు. వంతెన నిర్మాణం ఆవశ్యకతపై పలుమార్లు ఆయన ముఖ్యమంత్రికి లేఖలు రాశారు. జిల్లా కేంద్రంలో గోదావరి వంతెన సాధన సమితి ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టారు. ఆందోళనలు ఉధృతమవుతున్న తరు ణంలో ఎట్టకేలకు వంతెనను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది.

తగ్గనున్న దూరభారం

మంచిర్యాల వద్ద గోదావరి నదిపై వంతెన నిర్మాణం పూర్తయితే గరిష్ఠంగా దూరం తగ్గనుంది. రెండు జిల్లాల మధ్య కనీసం 40 కిలోమీటర్ల దూరం తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం కరీంనగర్, హైదరాబాద్ లాంటి సుదూర ప్రాంతాలకు ప్రయాణం చేయాలంటే గోదావరిఖని మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. మంచిర్యాల-శ్రీరాంపూర్- గోదావరిఖని వరకు వెళ్లేందుకు అధిక రవాణా భారం, ట్రాఫిక్ కారణంగా కనీసం 45 నిమిషాలు అదనంగా సమయం వెచ్చించాల్సి వస్తుంది. వంతెన నిర్మాణం పూర్తయితే మంచిర్యాల నుంచి నేరుగా బసంత్‌నగర్, కరీంనగర్, హైదరాబాద్‌లకు చేరుకునే వెసలుబాటు ఉంటుంది.

స్థల మార్పిడి యోచనలో

గోదావరిపై రెండు జిల్లాల నడుమ వంతెన నిర్మాణం ప్రజల చిరకాల కోరిక కావడంతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలనే విజ్ఞప్తులు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో వంతెన కోసం గతంలో ప్రతిపాదించిన స్థలం కాకుండా మరో చోటికి మార్పు చేస్తారనే ప్రచారం ఊపందుకుంది. ముందుగా ప్రతిపాదించనట్లు జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డు గౌతమేశ్వరాలయం వద్ద కాకుండా, హాజీపూర్ మండలం ముల్కల్ల వద్ద గోదావరిపై వంతెన నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. గౌతమేశ్వరాలయం వద్ద వంతెన నిర్మిస్తే పట్టణంలో విపరీతమైన ట్రాఫిక్ పెరిగి ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నందున ముల్కల్ల వద్ద నిర్మాణం చేపట్టాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. శుభకార్యాలు, కర్మకాండల కోసం పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో గోదావరి స్నానాలపై ఆధారపడతారు. ముఖ్యంగా పండుగలు, పర్వదినాల్లో కాలేజీ రోడ్డులో రద్దీ ఉంటుంది. అక్కడ బ్రిడ్జి నిర్మిస్తే మరింతగా సమస్యలు తప్పవనే భావనతో స్థలం మార్చాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఒకవేళ ముల్కల్ల వద్ద గోదావరిపై వంతెన నిర్మాణం చేపడితే పనులు మరింత ఆలస్యమయ్యే అవకాశాలున్నాయి. కాగా వంతెన నిర్మాణం ఎక్కడ చేపట్టినా త్వరితగతిన పనులు ప్రారంభించేటట్లు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


గోదావరి వద్ద సర్వే జరుపుతున్న ఆర్‌అండ్‌బీ అధికారులు (ఫైల్)

మాతా శిశు ఆసుపత్రిలో మెరుగైన సేవలు


రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 27: గర్భిణీలు, పసిపిల్లల సంక్షేమానికి జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆసుపత్రి ద్వారా మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. శనివారం మాతా శిశు ఆసుపత్రిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుబ్బారాయుడు, ఆర్‌ఎంవో భీష్మ, డీసీహెచ్‌ఎస్ కోటేశ్వర్‌తో కలిసి తనిఖీ చేశారు. ప్రసూతి, పిల్లలు, ల్యాబ్, ఇతర వార్డులు, వైద్యులు, సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్, మందులు ఇతర రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణీలు, పిల్లలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. గర్భిణీలు తమ వివరాలు పీహెచ్‌సీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఆసుపత్రుల్లోనే సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, గర్భిణీలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. గర్భిణీలు, బాలింతలకు రక్తహీనతను తగ్గించడానికి పోషకాహార కిట్‌లను అందిస్తామన్నారు. కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల వైద్య సేవలు, శస్త్రచికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. గైర్హాజరు, విధి నిర్వహణలో నిర్లక్ష్యం అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం


మాట్లాడుతున్న సీఐ ముష్కె రాజు

ఏసీసీ, జనవరి 27: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను శనివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో సీఐ ముష్కె రాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక ధృడత్వం కలుగుతుందన్నారు. టోర్నమెంట్‌లో ఉమ్మడి జిల్లా నుంచి 32 టీంలు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేత జట్టుకు రూ.20 వేలు, ద్వితీయ రూ.15 వేలు, తృతీయ రూ.10 వేలు నగదు, ట్రోఫీ అందిస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్ల శంకర్, మైలారం శ్రీనివాస్, ఎస్‌ఐ విజయ్‌కుమార్, ట్రినిటీ హైస్కూల్ కరస్పాండెంట్ బిజుకురువిల్లా, కౌన్సిలర్ చైతన్యసత్యపాల్‌రెడ్డి, సిద్దయ్య, శ్రీనివాస్, రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

అసహనంతో మాట్లాడుతున్న కేటీఆర్


మాట్లాడుతున్న తెలంగాణ జన సమితి నాయకులు

ఏసీసీ, జనవరి 27: అధికారం చేజారి అసహనంతో కేటీఆర్ మాట్లాడుతున్నాడని తెలంగాణ జనసమితి నాయకులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల కేటీఆర్ కోదండరాంను ఎమ్మెల్సీగా గవర్నర్ ఎలా అనుమతిస్తారని ప్రశ్నించడం శోచనీయమన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డ కేటీఆర్ గతంలో చేసిన తప్పులను గుర్తు చేసుకోవాలన్నారు. ప్రాజెక్టుల పేరిట లక్షల కోట్ల అప్పులు చేసి ఖజానాను జేబుల్లో నింపుకున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సాధనలో ముఖ్య పాత్ర పోషించిన కోదండరాంను ఎమ్మెల్సీగా నామినేట్ చేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అభినందించాల్సి పోయి విమర్శించడం కేటీఆర్ తగదన్నారు. టీజేఎస్ రాష్ట్ర అర్గనైజేషన్ సెక్రటరీ బాపన్న, జిల్లా అధ్యక్షుడు రాంచందర్ రెడ్డి ప్రవీణ్‌కుమార్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడికి జాతీయ స్థాయి అవార్డు


డాక్టర్ శివకుమార్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 27: కేరళలోని కొచ్చిలో జరిగిన భారత జాతీయ శిశు వైద్యుల సదస్సులో మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ కాసం శివకుమార్ జాతీయ స్థాయి అవార్డు అందుకున్నారు. శివకుమార్ తల్లిపాల వారోత్సవాలు, చిన్న పిల్లల సంరక్షణ తదితర కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించినందుకు ఆయనకు అవార్డు వచ్చింది. అవార్డు అందుకున్న డాక్టర్ శివకుమార్‌కు జిల్లా వైద్యులు, ప్రజలు అభినందనలు తెలియజేశారు.

రామకృష్ణాపూర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రామకృష్ణాపూర్, జనవరి 27: రామకృష్ణాపూర్ సర్వసతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. శ్రీనివాస గార్డెన్స్‌లో 1997-98లో శిశుమందిర్‌లో చదువుకున్న విద్యార్థులు 25 ఏళ్ల తరువాత ఒక్కచోట చేరి తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సుమారు 80 మంది విద్యార్థులు కలుసుకొన్నారు. ఉద్యోగం, కుటుంబాల గురించి ఒకరికొకరు తెలుసుకొన్నారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. పూర్వ విద్యార్థి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గేట్ వాల్వ్


రెబ్బనపల్లిలో రోడ్డు పక్కనే ఉన్న గేట్‌వాల్వ్

దండేపల్లి, జనవరి 27: రెబ్బనపల్లి ప్రభుత్వ పాఠశాల వైపు వేళ్లే రోడ్డులో మంచినీటి పథకం సంబంధించిన గేట్ వాల్వ్‌కు పైకప్పులు లేక ప్రమాదకరంగా ఉన్నాయి. నిత్యం రోడ్డు గుండా రైతులు, స్థానికులు, విద్యార్థులు వెళతుంటారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం, అధికారులు స్పందించి రోడ్డును అనుకొని ఉన్న మంచి నీటి గేట్ వాల్వ్‌పై కప్పులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కన్నెపల్లి, జనవరి 27 : కన్నెపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో రాధాకిషన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలన్నారు.

టీఎస్‌యూటీఎఫ్
మండల కార్యవర్గం


అధ్యక్షురాలు సునీత

కాసిపేట, జనవరి 27: తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ మండల అధ్యక్షురాలిగా సునీతను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు జిల్లా ఉపాధ్యక్షుడు జి. చక్రపాణి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా వేల్పుల కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా రమేష్, నవీన, కోశాధికారిగా స్వామినాథ్, కార్యదర్శులుగా సులోచన, విజయరావు, లతలను ఎన్నుకున్నారు. నాయకులు భీంరావు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల ఆర్టీసీ డిపో సమస్యలు పరిష్కరిస్తాం


జెండా ఊపి బస్సు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

ఏసీసీ, జనవరి 27: మంచిర్యాల ఆర్టీసీ డిపో సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలందిస్తామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం ఆర్టీసీ డిపో ఆవరణలో మంచిర్యాల నుంచి హైద్రాబాద్‌కు ఏర్పాటు చేసిన లహరి స్లీపర్ ఏసీ, నాన్ ఏసీ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కొత్త బస్సులు ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటాయన్నారు. ఆర్టీసీ డిపోలో పనిచేసే మహిళా ఉద్యోగులకు ప్రత్యేక విశ్రాంతి గదిని నిర్మించాలని డిపో మేనేజర్‌ను ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ప్రజలు తిరస్కరించినప్పటికీ కాంగ్రెస్‌పై దుమ్మెత్తి పోయడం శోచనీయమన్నారు. బీఆర్‌ఎస్ నేతలు పద్ధతులు మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేస్తుందన్నారు. కేసీఆర్ ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో పడవేశారని విమర్శించారు. ఎన్నికల ముందు రూ.8600 కోట్లు కాంట్రాక్టర్‌లకు చెల్లించి కేసీఆర్ ప్రభుత్వం కమీషన్‌లు తీసుకుందని ఆరోపించారు. డిపో మేనేజర్ రవీంద్రనాథ్, అసిస్టెంట్ మేనేజర్ దేవపాల, తూముల నరేష్‌పూదరి తిరుపతి, రావుల ఉప్పలయ్య, పెంట రజిత,వేములపల్లి సంజీవ్, హేమలత, ఒడ్నాల శ్యాం పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ బాధితులకు పరిహారం అందిస్తాం


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

ఏసీసీ, జనవరి 27: రోడ్డు విస్తరణలో ఇండ్లు, భూములు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం నుంచి సాధ్యమైనంత మేరకు పరిహారం అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని హమాలీవాడలో రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోతున్న బాధితులతో మాట్లాడి భరోసా కల్పించారు. పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న 60 ఫీట్ల రోడ్డును ప్రజల కోరిక మేరకు 55 ఫీట్లకు కుదిస్తున్నట్లు తెలిపారు. ఏ పార్టీ అనే తేడా లేకుండా రోడ్డు విస్తరణలో నష్టం జరుగుతున్న ప్రతీ ఒక్కరికి న్యాయం చేస్తామన్నారు. రోడ్డు విస్తరణలో ఇండ్ల తొలగింపులో ఎవరి పట్ల వివక్ష చూపించమన్నారు. గత పాలకుల వివక్షత వల్ల రోడ్డు విస్తరణ ఆగిపోవడంతోపాటు వివాదస్పదంగా మారిందన్నారు. మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, నాయకులు నల్ల శంకర్, చిట్ల సత్యనారాయణ, సంజీవ్, మాజిద్, ఇంజనీర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

లక్షెట్టిపేట రూరల్: దౌడపల్లి గ్రామంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న లక్మారెడ్డి కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి కుటుంబ పరిస్థితి గురించి తెలుసుకున్నారు. కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని మనోధైర్యాన్ని నింపారు. పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి రమేష్ వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమెల రాజు ఎంపీటీసీ సుజాతసురేష్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్‌కు
కవిత మద్దతు ఇవ్వడం హర్షణీయం

జన్నారం, జనవరి 27: బీసీ రిజర్వేషన్ ఉద్యమానికి కల్వకుంట్ల కవిత మద్దతు ఇవ్వడం హర్షణీయమని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం మండల నాయకులు రాగుల శంకర్ పేర్కొన్నారు. శనివారం జన్నారంలో ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్‌లు సాధించే వరకు ఉద్యమం చేపట్టాలన్నారు. గతేడాది పార్లమెంట్‌లో మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదించినప్పటికీ ఇందులో కూడా బీసీ మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌లు ఏర్పడే విధంగా పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టాలని కోరారు. నాయకులు నర్సింహులు, నారాయణ, మల్లేష్, నరసయ్య, చంద్రయ్య, శ్రీనివాస్, నరేందర్, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడికి
సన్మానం

బెల్లంపల్లి, జనవరి 27 : ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ, అజ్మీర శ్రీనివాస్‌లు ఘనంగా సన్మానించారు. శనివారం బెల్లంపల్లిలోని బీజేపీ కార్యాలయానికి వచ్చిన కళ్యాణ్ నాయక్‌ను అభినందించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి గోవర్ధన్, సీనియర్ నాయకులు అజ్మీర శ్రీనివాస్, స్వామి, శంకర్, మోహన్, శ్రావణ్‌కుమార్, నర్సింగ్, రాములు, సుభాష్, సంతోష్ అగర్వాల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా పలువురు సీఐల బదిలీలు

ఏసీసీ, జనవరి 27: జిల్లా వ్యాప్తంగా పలువురు సీఐలను బదిలీ చేస్తూ మల్టీ జోన్ 1 ఇన్స్‌పెక్టర్ జనరల్ తరుణ్‌జోషి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గోదావరిఖని టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా పనిచేస్తున్న ఎస్‌డీ అఫ్జలొద్దీన్‌ను బెల్లంపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా అక్కడ పని చేస్తున్న రాజ్‌కుమార్‌గౌడ్‌ను టాస్క్‌ఫోర్స్ 1 రామగుండం సీఐగా బదిలీ చేశారు. సీసీఎస్3 రామగుండం సీఐగా పని చేస్తున్న ఎన్.దేవయ్యను బెల్లంపల్లి వన్‌టౌన్ సీఐగా, అక్కడ పని చేస్తున్న బన్సీలాల్‌ను శ్రీరాంపూర్ సీఐగా బదిలీ చేశారు. శ్రీరాంపూర్ సీఐ రమేష్‌బాబును సీఎస్‌బీ4 రామగుండం సీఐగా బదిలీచేశారు. టాస్క్‌ఫోర్స్ 2 పెద్దపల్లి సీఐగా పని చేస్తున్న సుధాకర్‌ను చెన్నూరు రూరల్ సీఐగా అక్కడ పని చేస్తున్న విద్యాసాగర్‌ను ఐజీ ఆఫీసులో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. సీసీఎస్ రాజన్న సిరిసిల్ల సీఐ రవీందర్‌ను చెన్నూరు టౌన్ సీఐగా అక్కడ పని చేస్తున్న వాసుదేవరావును ఐజీ ఆఫీసులో రిపోర్టు చేయాలని ఆదేశించారు. పీసీఆర్ ఆదిలాబాద్ సీఐ రవిని మందమర్రి సీఐగా, మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డిని ఐజీ ఆఫీసులో రిపోర్టు చేయాలని ఆదేశించారు. లక్షెట్టిపేట సీఐ కృష్ణను పెద్దపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా, సీసీఆర్‌బీ రామగుండం సీఐ ఆకుల అశోక్‌ను మంచిర్యాల రూరల్ ఇక్కడ పని చేస్తున్న సంజీవ్‌ను ఐజీ ఆఫీసులో రిపోర్టు చేయాలని ఆదేశించారు. నార్నూర్ సీఐ ప్రేమ్‌కుమార్‌ను సీఎస్‌బీ2, ఇక్కడ పని చేస్తున్న మొగిలిని సీసీఆర్‌బీ కరీంనగర్ సీఐగా బదిలీ చేశారు. మంచిర్యాల టౌన్ సీఐ ముష్కె రాజును ఐజీ ఆఫీసులో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

కోదండరాంకు ఎమ్మెల్సీ ఇవ్వడంపై హర్షం

కాసిపేట, జనవరి 27 : తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాంకు ఎమ్మెల్సీ ఇవ్వడం సంతోషకరమని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. శనివారం సోమగూడెంలో దుర్గం గోపాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కోదండరాంకు ఎమ్మెల్సీ ఇచ్చి గౌరవించడం ఆనందంగా ఉందన్నారు. నాయకులు భీమయ్య, మహేష్, చిలుకయ్య, రాంచందర్, శంకర్, సత్యనారాయణ, శ్రీనివాస్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న డీసీపీ సుధీర్‌రాంనాథ్‌కేకన్, హెల్మెట్ ధరించిన వాహనదారుడికి గులాబీ ఇస్తున్న పోలీసులు

ఏసీసీ, జనవరి 27: రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డీసీపీ సుధీర్ రాంనాథ్‌కేకన్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హాల్‌లో ఆటో డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా వాహనాలు నడుపుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాలన్నారు. లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ ఆటోలను నిలుపవద్దని, రోడ్డు పక్కనే ప్రయాణికులను దింపాలని సూచించారు. రోడ్డుప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను దగ్గరలోని ఆసుపత్రులకు తరలించాలన్నారు. ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, ఏసీపీ తిరుపతిరెడ్డి, ట్రాఫిక్ సీఐ నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ యోగేశ్వర్‌సింగ్ జాదవ్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ఎస్‌ఐ రాజశేఖర్‌తో కలిసి వాహనదారులకు అవగాహన కల్పించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. సిగ్నల్ల వద్ద జాగ్రత్తలు పాటించాలన్నారు. అధిక వేగంతోనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. ఏఎస్‌ఐ లక్ష్మణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భీమిని: రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్సై ప్రశాంత్ అన్నారు. మండల కేంద్రంలో అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే శిక్షార్హులు అవుతారని, అతివేగం అనర్థానికి దారితీస్తుందన్నారు. కారులో ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు నడపొద్దన్నారు. ఎస్సై రాజయ్య పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: రోడ్డు భద్రతా ఉత్సవాలను పురస్కరించుకొని రామకృష్ణాపూర్ పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో క్యాతన్‌పల్లి రైల్వే గేట్ వద్ద వాహనదారులను కలిసి వారికి గులాబీ పూలు అందించారు. తలపై హెల్మెట్ ధరించాలని, దీనివల్ల ప్రమాదాలు జరిగినప్పుడు రక్షణ కల్పిస్తుందని చెప్పారు. వాహనాలకు అవసరమైన పత్రాలను వెంట ఉంచుకోవాలని కోరారు.

కేంద్రంలో మళ్లీ బీజేపీదే అధికారం

మందమర్రిటౌన్, జనవరి 27: కేంద్రంలో రాబోయేది మళ్లీ మోదీ ప్రభు త్వమేనని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా 400 పార్లమెంట్ స్థానాలు సాధిం చడం ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకులు దుర్గం అశోక్ తెలిపారు. శని వారం మందమర్రిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలో 10 పార్లమెంట్ స్థానాలు బీజేపీ సాధిస్తుందన్నారు. కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. అయోధ్య బాల రాముని ప్రతిష్ఠతో ప్రపంచం మొత్తం దేశం వైపు చూసిందన్నారు. 500 సంవత్సరాల ప్రజల ఆకాంక్షను ప్రధాని మోదీ నెరవేర్చారన్నారు. నాయకులు కుమారస్వామి, రమేష్, దీక్షితులు, దుర్గరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

జైపూర్, జనవరి 27 : శెట్‌పల్లి గ్రామంలో శని వారం కరీంన గర్‌కు చెందిన ప్రతిమ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చారు. శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇందులో 72 మంది రోగులకు కంటి, ఇతర సమస్యల నిమిత్తం ప్రతిమ ఆసుపత్రికి ఉచిత బస్సు సౌకర్యం కల్పించి తీసుకువెళ్లారని సర్పంచు మేడి రవి తెలిపారు. వైద్యులు రోష్న, దీప్తి, ఆశిశ్‌రెడ్డి, అక్షయ్‌రెడ్డి, రోహిత్, ఆసుపత్రి అసిస్టెంట్ మేనేజర్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాన్ని కూల్చివేసిన అధికారులు



కట్టడాన్ని కూల్చి వేయిస్తున్న అధికారులు

బెల్లంపల్లి, జనవరి 27 : పట్టణంలోని పోచమ్మ ఆలయం సమీపంలో అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ కట్టడాన్ని శనివారం రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. ఆలయం సమీపంలో ఒక స్వచ్ఛంద సంస్థ సభ్యుడు బాడీ ఫ్రీజర్లు భద్రపర్చడానికి గదిని నిర్మిస్తుండగా సమాచారం అందుకున్న ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ సుధాకర్, మున్సిపల్ కమిషనర్ భుజంగంలు సిబ్బంది సహాయంతో నిర్మాణాన్ని కూల్చి వేయించారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు నిర్మిస్తే చర్యలు తీసుకొంటామన్నారు. ఆర్ఐలు విజయలక్ష్మీ,ఆదిలక్ష్మీ, పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న నాయకులు

బెల్లంపల్లి, జనవరి 27: హజ్రత్ తాజుద్దీన్ బాబా జన్మదినాన్ని పట్టణంలోని శంషీర్‌నగర్‌లోని జెడ్పీఎస్ఎస్ ఉర్దూ పాఠశాలలో శనివారం మైనార్టీ నాయకులు నిర్వహించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాంయాదవ్, నాయకులు అన్వర్‌ఖాన్, గౌస్, సురేష్, జావీద్‌ఖాన్, ఆసిఫ్, అఫ్జల్‌బాబా, అమానుల్లాఖాన్, బ్రహ్మం, ఫెరోజ్‌ఖాన్, పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

చెన్నూరు: హజ్రత్ తాజుద్దీన్ బాబా రహమతుల్లా అలే జన్మదినం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. షాకీర్‌బాబ, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజుద్దీన్, నాయకులు అన్వర్‌షేక్, మస్రుద్, జలీల్,రహీం,షఫీ తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూములను కాపాడాలి

లక్షెటిపేటరూరల్, జనవరి 27: మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 250లో దళితులకు కేటాయించిన భూములను కాపాడాలని శనివారం బహుజన రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్, దళిత నాయకుడు మురళిలు అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతిపత్రం అందించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేపడుతున్న అక్రమ నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు అనుమతులు ఇవ్వకుండా చర్యలు చేపట్టాలన్నారు. 1991లో ప్రభుత్వం ఈ సర్వే నంబర్‌లో దళితులకు భూమి కేటాయించిందని, కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు దళితులను మభ్యపెట్టి వ్యాపారాలు చేస్తున్నారన్నారు.

మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత

దండేపల్లి, జనవరి 27 : కొండాపూర్ గ్రామానికి చెందిన చిలుకూరి పరందామచారి ఇటీవల ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందాడు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లిరఘునాథ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం 50 కేజీల బియ్యంను పార్టీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య ఆధ్వర్యంలో వారి కుటుంబానికి అందజేశారు. నాయకులు తెలసి, సుమన్, రాజు, సతీష్, భూమన్న, సత్తన్న పాల్గొన్నారు.

సీఎంఆర్ కష్టాలు

- బియ్యం లోటు భర్తీ చేసేందుకు మిల్లర్ల తంటాలు
- ప్రభుత్వం గడువు విధించడంతో ఆగమాగం
- మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి రీసైక్లింగ్ స్టాకు కొనుగోలు
- లారీల ద్వారా రాత్రి వేళల్లో అక్రమంగా తరలింపు



జైపూర్ మండలంలోని రైస్ మిల్లులో బియ్యం లోడ్‌తో ఉన్న మహారాష్ట్ర లారీలు

మంచిర్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కస్టమ్ మిల్లింగ్ కోసం అప్పగించిన బియ్యాన్ని మాయం చేసిన రైస్ మిల్లర్లు తిరిగి ఆ లోటు భర్తీ చేసేందుకు నానా తంటాలు పడుతున్నారు. మిల్లర్లకు ఈ నెలాఖరు వరకు తుది గడువు విధించడంతో ఆగమేఘాల మీద మహారాష్ట్ర నుంచి కొనుగోలు చేసి మరీ రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించి సీఎంఆర్ కోసం అప్పగించిన వడ్లను అధిక ధరలకు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. ఒక సీజన్‌లో వడ్లు అమ్ముకున్న మిల్లర్లు మరో సీజన్‌లో వచ్చిన వడ్లను మిల్లింగ్ చేసి సీఎంఆర్ పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో తిరిగి ఆ లోటును భర్తీ చేసేందుకు తంటాలు పడుతున్నారు.

మిల్లర్ల వ్యాపారం..

ప్రభుత్వం సీఎంఆర్ కోసం మిల్లర్లకు అప్పగించిన వడ్లను అమ్ముకొన్నారనే ఆరోపణలున్నాయి. వడ్లు క్వింటాలుకు రూ.2,200 నుంచి రూ.2,300కు, బియ్యం రూ.3 వేల నుంచి రూ.3200కు మార్కెట్లో అమ్ముకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒక సీజన్‌కు సంబంధించిన వడ్లను అమ్ముకొని, మరో సీజన్ వడ్లు రాగానే మిల్లింగ్ చేసి సీఎంఆర్ పెడుతు న్నట్లు సమాచారం. ఇలా ఒక్కో మిల్లర్ సీజన్‌కు రూ.3 కోట్ల నుంచి రూ.5 కోట్లకు పైగా సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది.

లెక్కల్లో తేడాలు..

మంచిర్యాల జిల్లాలో 2022-23 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి సుమారు 1.60 లక్షల టన్నుల వడ్లు మిల్లుల్లో నిల్వ ఉండాల్సి ఉంది. ఆ మేరకు అందుబాటులో లేకపోవడంతో మిల్లర్లు పక్కదారి పట్టించారనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. గత యాసంగి, వానాకాలం సీజన్లలో రైతుల నుంచి సేకరించి మిల్లుల్లో నిల్వ ఉంచిన ధాన్యంలో జిల్లాలో 20వేల టన్నులకు టెండర్ వేయాలని రెండు నెలల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. టెండర్లలో పాల్గొనాలనే ఆసక్తితో ఏపీలోని రాజమండ్రి, మహారాష్ట్రలోని గోందియాకు చెందిన వ్యాపారులు ప్యాడీ క్వాలిటీని పరిశీలించేందుకు జిల్లాకు వచ్చారు. సివిల్ సప్లయ్ సిబ్బందితో కలిసి హాజీపూర్ మండలం నర్సింగాపూర్‌లోని ఓ మిల్లును సందర్శించగా అక్కడ రికార్డుల్లో చూపుతున్న దానికి, నిల్వలకు పొంతన కుదరలేదు. దీంతో మరోసారి రావాలంటూ వ్యాపారులను వెనక్కి పంపినట్లు తెలిసింది.

మంచిర్యాల జిల్లాలో మొత్తం 54 రైస్ మిల్లులు ఉండగా, గత యాసంగి సీజన్‌కు సంబంధించి 80,336 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ టార్గెట్ విధించారు. ఇప్పటి వరకు 51,896 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ అందజేశారు. మరో 28,440 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో ఉంది. ఈ సీజన్‌లో 65 శాతం సీఎంఆర్ పూర్తి చేసినట్లు అధికారుల లెక్కల ద్వారా తెలుస్తోంది. అలాగే వానాకాలం సీజన్‌కు సంబంధించి 62,086 మెట్రిక్ టన్నులు లక్ష్యం కాగా అందులో కేవలం 17,784 మెట్రిక్ టన్నులు మాత్రమే డెలివరీ చేశారు. మరో 44,302 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో ఉంది. ఈ సీజన్‌లో కేవలం 29 శాతం మాత్రమే సీఎంఆర్ పూర్తి చేయడం గమనార్హం.

లోటు భర్తీ చేసేందుకు..

సీఎంఆర్ పూర్తి చేసేందుకు ప్రభుత్వం డెడ్‌లైన్ విధించడంతో మిల్లర్లు బియ్యం లోటును భర్తీ చేసేందుకు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి దిగుమతి చేసుకుంటు న్నారు. ఇటీవల జైపూర్ మండలంలోని ఓ రైస్ మిల్లుకు మహారాష్ట్రకు చెందిన రెండు లారీల ద్వారా రాత్రి వేళల్లో బియ్యం తరలించారు. గతంలో తెలంగాణ నుంచి మహారాష్ట్రకు తరలిన పీడీఎస్ రైస్‌ను అక్కడి కొన్ని మిల్లుల్లో రీ సైక్లింగ్ చేయించి, సన్న బియ్యం పేరుతో తిరిగి ఇక్కడికే అధిక ధరలకు విక్రయం కోసం పంపే వారు. ప్రస్తుతం రైస్ మిల్లుల్లో బియ్యం కొరత ఉండ డంతో మహారాష్ట్రలో రీ సైక్లింగ్ చేయించిన బియ్యాన్ని గుట్టు చప్పుడు కాకుండా లారీల్లో తరలిస్తున్నారు. వే బిల్లులు సరిగ్గా లేకపోయినా, లక్ష్యం పూర్తి చేయాలనే ఉద్దేశ్యం తో అధికారులు అవేమీ పట్టించుకోవడం లేదని తెలుస్తోంది.

ఎన్నికలు నిర్వహించాలని ఓరియంట్ కార్మికుల ఆందోళన



డీసీఎల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

కాసిపేట, జనవరి 27 : దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని శనివారం మంచిర్యాలలోని డీసీఎల్ కార్యాలయం ఎదుట ఓరియంట్ కార్మికులు ఆందోళన చేపట్టారు. కార్మిక సంఘం నాయకుడు మేరుగు శంకర్ మాట్లాడుతూ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో గుర్తింపు సంఘం కాల పరిమితి ముగిసి రెండేండ్లు గడిచినా ఎన్నికలు నిర్వహించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు మూడు సార్లు కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించినా ఎన్నికల తేదీని ప్రకటించ లేదన్నారు. వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలన్నారు. అనంతరం డీసీఎల్ సునీత మాట్లాడుతూ మూడు రోజుల్లో నివేదికలు ఉన్నతాధికారులకు పంపిస్తామని, సాధ్యమైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సత్యనారాయణ, రాంకిరణ్, రొడ్డ మల్లేష్, శంకర్, మహేం దర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

హాజీపూర్, జనవరి 27 : నబ్బెపల్లి గ్రామానికి చెందిన బ్యారి ఉమ (45) మంచిర్యాలలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. ఉమ కూలీ పనులు చేస్తుండగా భర్త లచ్చయ్య ఏ పని చేయకుండా తిరుగుతుండడంతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చిన ఉమ భర్తను ఏ పని చేయవా అని ప్రశ్నించడంతో ఇద్దరు గొడవపడ్డారు. లచ్చయ్య బయటకు వెళ్లగా మనస్తాపంతో ఉమ ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. అనంతరం గమనించిన లచ్చయ్య మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపారు. మృతురాలి సోదరుడు మచ్చ కోటయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కలెక్టరేట్ ముట్టడి కరపత్రాల విడుదల



మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 27: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని సోమవారం చేపట్టిన ఛలో కలెక్టరేట్ ముట్టడి కరపత్రాలను శనివారం ఎస్ఎఫ్ఐ నాయకులు విడుదల చేశారు. జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలోని విద్యార్థులు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ ముట్టడి చేపడుతున్నామన్నారు. నాయకులు అభినవ్, రాంచరణ్, వంశీ, కృష్ణ, మురళీ, మహేష్‌రవి, కిరణ్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీపై స్పష్టత ఇవ్వాలి

మందమర్రి మండల సమావేశంలో వాడీవేడి చర్చ



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, అధికారులు

మందమర్రిరూరల్, జనవరి 27: ఆయిల్‌పామ్ ఏర్పాటుపై స్పష్టత ఇవ్వాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు అధికారులను నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ గుర్రం మంగశ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. శంకర్‌పల్లిలో రూ.500 కోట్లతో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి మాజీ మంత్రి కేటీఆర్ భూమి పూజ చేశారని, అసలు ఫ్యాక్టరీ నిర్మిస్తారా లేదా అని ఉద్యానవన అధికారి తిరుపతిని కో ఆప్షన్ సభ్యుడు నసీరొద్దీన్, సర్పంచు తిరుపతిలు ప్రశ్నించారు. దీనిపై కాంగ్రెస్ నాయకుడు, చిర్రకుంట సర్పంచు ఒడ్నాల కొమురయ్య మాట్లాడుతూ హడావుడిగా ఆయిల్‌పామ్ కంపెనీ ఏర్పాటుకు అప్పటి ప్రభుత్వం భూమి పూజ చేసిందని పేర్కొన్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్ మాట్లాడుతూ 75 నుంచి 78 ఎకరాలను ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి సేకరించామని, కంపెనీ పర్మ్ అమౌంట్ చెల్లించలేదని తెలిపారు. రైతులు వరికి బదులు ఇతర పంటలపై దృష్టి సారించాలని ఏవో రాజేశం సూచించారు. రైతుబంధు ఎప్పుడు పడుతుందని, పూర్తిస్థాయిలో రైతుబంధు ఎప్పుడు చెల్లిస్తారని ఏవోను నిలదీశారు. ఏఎన్ఎం ఒక్కరే అందుబాటులో ఉన్నారని, మరొకరిని నియమించాలని సభ్యులు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తునికాకు కూలీలకు చెల్లించాల్సిన రూ.22 కోట్లను మంజూరు చేయాలని సర్పంచు కొమురయ్య అధికారులను కోరారు. సర్పంచు సోదరి పున్నం మాట్లాడుతూ మామిడి రైతులకు సరైన అవగాహన లేక నష్టపోతున్నారని, ఉద్యానవన శాఖ అధికారులు మామిడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీపీ గుర్రం మంగశ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, అధికారులు, ప్రజాప్రతినిధులు మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. జడ్పీటీసీ వేల్పుల రవి, వైస్ ఎంపీపీ లౌడం రాజ్‌కుమార్, ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రావు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ



సుభాష్



హరీష్

వాంకిడి, జనవరి 27: మండల సాయిగోపాల ఇంగ్లీష్ మీడియంపాఠశాలలో టీఎస్‌టీయూటీఫ్ మండల కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధానకార్యదర్శిగా ఇందురావు తెలిపారు. అధ్యక్షుడిగా సుభాష్, ప్రధాన కార్యదర్శిగా హరీష్, ఉపాధ్యక్షులుగా రవికుమార్, అరుణ్, కోశాధికారిగా జగదీష్, కార్యదర్శులుగా దశరథ్, సాయికుమార్, లక్ష్మణ్, కాలేరం, కిరణ్‌కుమార్, సులబాయి, ఆరీఫ్‌ను ఎన్నుకున్నారు.

పఠన కృత్యాలు నిర్వహించాలి

తిర్యాణి, జనవరి 27: పిల్లల్లో పుస్తక పఠన అభివృద్ధికోసం పఠనకృత్యాలు నిర్వహించాలని తిర్యాణి జడ్పీఎస్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు అంజయ్య అన్నారు. శనివారం మండలంలోని భీమారం, దుర్గా పూర్, గంభీరావుపేట మండల పరిషత్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం పరిశీలించారు.

ద్విచక్రవాహనంపై నుంచి పడి ఒకరికి గాయాలు

బెజ్జూరు, జనవరి 27: మండలంలోని కుకుడ గ్రామ సమీపంలోని రైతువేదిక వద్ద శనివారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడడంతో ఒకరికి గాయాలయ్యాయి. పెంచికలపేట మండలం గుండెపల్లి గ్రామానికి చెందిన మడె తోగయ్య వ్యక్తిగత పనులపై కుకుడకు వెళ్లి వస్తుండగా ద్విచక్రవాహనం అదనపు తప్పి కిందపడ్డాడు. దీంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించి బెజ్జూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు తోగయ్యను కాగజ్‌నగర్‌కు తరలించారు.

మాజీఎమ్మెల్యే పరామర్శ

సిర్పూర్(టి), జనవరి 27: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆశిక్‌హుస్సేన్ మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా శనివారం ఆయన కుటుంబసభ్యులను మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించారు. ఆయనవెంట నాయకులు మహేష్, కిజర్ హుస్సేన్, జుబేద్‌లు ఉన్నారు.

దుప్పిమాంసం పట్టుకున్న అటవీ అధికారులు?

సిర్పూర్(టి), జనవరి 27: సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని చీలపల్లి అటవీప్రాంతంలో శుక్రవారం రాత్రి దుప్పిని హతమార్చి మాంసంను తరలిస్తున్న ముగ్గురిని అటవీశాఖాధికారులు పట్టుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు వారితో పాటు మాంసంను స్వాధీనం చేసుకుని రేంజ్ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నారు. దుప్పిని హతమార్చడంలో ఇంకా ఎంత మంది ఉన్నారన్న కోణంలో వివరాలు రాబడుతున్నట్లు తెలిసింది. ఈ విషయమై ఎఫ్ఆర్వో పూర్ణచందర్‌రావును వివరణ కోరగా విచారణ జరుగుతోందని వివరాలు తరువాత వెల్లడిస్తామని తెలిపారు.

భీం స్ఫూర్తితో పోరాటానికి సిద్ధం కావాలి

- బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్



భీం విగ్రహానికి పూల మాల వేస్తున్న కళ్యాణ్‌నాయక్

కెరమెరి, జనవరి 27: కుమరం భీం స్ఫూర్తితో గిరిజనులు పోరాటాలకు సిద్ధం కావాలని బీజేపీ ఎస్టీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కళ్యాణ్‌నాయక్ అన్నారు. శనివారం ఆయన కుమరంభీం పోరాడి అసువులు బాసిన జోడేఘాట్‌ను సందర్శించి భీం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి నేటికి 70సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఆదివాసీలకు సరైన ఇల్లు, రోడ్లు, విద్య అందించడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ఆయనవెంట రవినాయక్, శ్రీనివాస్, హేమాజీ, ధర్మానాయక్, తిరుపతి, వేణు, అరుణ్‌లోయ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్

రెబ్బెన, జనవరి 27: విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ చైర్మన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం తుంగెడలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించి జిల్లాకు చక్కటి పేరు తీసుకరావాలన్నారు. ఈ సందర్భంగా క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ అనిత, వినయ్, సర్పంచి పెంటయ్య, ఎంపీపీ సౌందర్య ఆనంద్, ఎంపీటీసీ హరీష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

దరిగాంలో దుప్పట్ల పంపిణీ

కాగజ్‌నగర్, జనవరి 27: కాగజ్‌నగర్ మండలం దరిగాంలో శనివారం జాగృతి మహిళ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో రూరల్‌సీఐ నాగరాజు, ఎస్సై సోనియా మాట్లాడుతూ నిరుపేదలకు సేవలు అందిస్తున్న జాగృతి మహిళ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, జాగృతి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



దుప్పట్లను పంపిణీ చేస్తున్న సీఐ

ఆటపాటలతో విద్యాబోధన చేయాలి

జైనూర్, జనవరి 27: గిరిజన విద్యార్థులకు ఆటపాటల ద్వార విద్యా బోధనందించాలని ఎస్సీఈఆర్టీ ఉయిక శంకర్ అన్నారు. మండలంలోని పానాపటార్, లచ్చుగూడ తదితర గ్రామాల్లోని పాఠశాలల్ని ఆయన శనివారం తనిఖీచేశారు. పాఠశాలలో విద్యార్థులతో పాటలు పాడి పించి వారిని చదువు పట్ల ఉత్తేజపరిచారు. అనంతరం మాట్లాడుతూ క్లస్టర్ పరిధిలోని పాఠశాలలు రెగ్యులర్‌గా నడిచేలా హెచ్ఎంలు చర్యలు తీసుకోవాలని సూచించారు.

వ్యక్తి అదృశ్యం

దహెగాం, జనవరి 27: మండలంలోని కోత్మీర్ గ్రామానికి చెందిన పిల్లల మహేందర్(35) 20రోజుల నుంచి అదృశ్యమైనట్లు అతని భార్య అనసూర్య ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. 20రోజులుగా బంధువులు, పరిసర గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

నెన్నెల, జనవరి 27: క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు స్నేహభావం పెంపొందుతుందని ఎస్సై శ్యామ్‌పటేల్ అన్నారు. నెన్నెలలో శనివారం పుప్పాల మధూపటేల్ మెమోరియల్ నియోజకవర్గ స్థాయి క్రికెట్‌టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో మాట్లాడారు. పల్లె క్రీడాకారుల ప్రతిభ చాటేందుకు ఇలాంటి టోర్నీలు దోహదపడతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి వారికి పోలీస్ శాఖ తరపున ప్రోత్సాహం అందజేస్తామన్నారు. త్వరలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు.టోర్నీలో వివిధగ్రామాలకు చెందిన 42జట్లు పాల్గొంటున్నాయి. ఎంపీపీ సంతోషం రమాప్రతాప్‌రెడ్డి, కోఆప్షన్‌సభ్యులు ఎండీ ఇబ్రహీం, ఎంపీటీసీ పురంశెట్టి తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేష్, వైస్‌చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, ఆత్మ చైర్మన్ సున్నం రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సాగర్‌గౌడ్, సర్పంచ్ తోట సుజాత శ్రీనివాస్, నాయకులు రాంచందర్, సిద్దార్థ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి మిత్రులు అండగా..

దండేపల్లి, జనవరి 27: పాత మామిడిపల్లి గ్రామానికి చెందిన కస్తూరీ దేవయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. 1984–85లో దండేపల్లి ఉన్నత పాఠశాల చదువుకున్న పదో తరగతిమిత్రులు శనివారం స్నేహితుని కుటుంబాన్ని పరామర్శించి రూ. 36,500 రూపాయల నగదును దేవయ్య భార్య వసంతకు అందజేశారు. మిత్రులు నూరా తిరుపతి, అక్కల తిరుపతి, గోలి రవీందర్, బొలిశెట్టి దత్తయ్య, భూపతి, ఎస్ లింగయ్య, కానుగంటి చంద్రయ్య, ఎర్రం నర్సయ్య, చంద్రయ్య, రాజన్న, శ్రీనివాస్, రాములు తతదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఎఫ్ఆర్వో సరోజరాణి

వాంకిడి, జనవరి 27: వన్యప్రాణులను వేటాడితే కఠినచర్యలు తీసుకుంటామని డిప్యూటీరేంజ్ అధికారి సరోజరాణి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని బండకాస గ్రామంలో వన్యప్రాణుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడవి జంతువులను వేటాడేందుకు విద్యుత్‌తీగలు అమర్చినా, ఉచ్చులు బిగించినా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని దానికి అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవరావు, ఏఈవో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే



కేక్ కట్ చేస్తున్న ఎలక్ట్రీషియన్‌లు

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 27: ఆసిఫాబాద్ పట్టణంలో శనివారం ఎలక్ట్రీషియన్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మోయినుద్దీన్, గంగన్న, కాలు, సురేష్, మహ్మద్, సాయి, పవన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ లెక్చరర్‌కు సన్మానం



అధ్యాపకుడిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వాంకిడి, జనవరి 27: వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న లెక్చరర్ చంద్రయ్య జిల్లా ఉత్తమ లెక్చరర్‌గా ప్రశంసా పత్రం అందుకున్నందుకుగాను శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ తోపాటు అధ్యాపకులు, విద్యార్థులు ఆయనను ఘనంగా సన్మానించారు.

బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీచేయాలి

రెబ్బెన, జనవరి 27: జిల్లాలోఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వికలాంగుల హక్కుల జాతీయవేదిక జిల్లానాయకుడు కస్తూరి రవికుమార్ డిమాండు చేశారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. 2016వికలాంగుల పరిరక్షణ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని డిమాండు చేశారు. సమావేశంలో వికలాంగులసంఘం నాయకులున్నారు.

నిలువ నీడేది?

- బస్ షెల్టర్లు లేక అవస్థలు
- మండుటెండలో ప్రయాణికుల పడిగాపులు
- తాగునీటికి దిక్కే లేదు
- తాత్కాలిక ఏర్పాటైనా చేయాలంటున్న ప్రజలు



రోడ్డు పక్కన బస్సు కోసం వేచి చూస్తున్న విద్యార్థులు, గ్రామస్థులు

బెజ్జూరు, జనవరి 27: జిల్లాలోని పలు మండలాల్లో బస్సు షెల్టర్లు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మరికొద్ది రోజుల్లో ఎండల కాలం రానుంది. ఎండ తీవ్రతతో పాటు వడగాలుల ఇబ్బందులు పెట్టే అవకాశాలుంటాయి. మరోవైపు ప్రయాణికులు మండే ఎండలోనే బస్సుల కోసం నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొనే అవకాశం ఉంది. చార్జీల పేరుతో ప్రయాణికుల నుంచి ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్న ఆర్టీసీ సౌకర్యాల కల్పనపై మాత్రం దృష్టి సారించకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో పదిహేను మండలాలుండగా కేవలం ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, కౌటాల మండలాల్లో బస్టాండ్‌లు ఉండగా, మిగితా మండలాల్లో కొన్నిచోట్ల మాత్రమే షెల్టర్లు ఉన్నాయి. బెజ్జూరు, చింతలమానేపల్లి, సిర్పూర్(టి), దహెగాం, రెబ్బెన, కెరమెరి, తిర్యాణి వంటి మండలాల్లో బస్టాండ్‌లు లేని కారణంగా వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. పెంచికలపేటలో చిన్న షెల్టర్ మాత్రమే ఉంది. ప్రయాణికులకు నిలువ నీడ లేకపోవడంతో ఎండలోనే నిలపడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. బస్సుల కోసం గంటల తరబడి రోడ్లపై, కిరాణ దుకాణాల ఎదుట, చెట్ల కింద వేచి చూడాల్సిన దుస్థితి ఉంది.

పట్టించుకోని అధికారులు..

బస్ షెల్టర్ల నిర్మాణంపై ఆర్టీసీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వా పోతున్నారు. మండలాల నుంచి నిత్యం వివిధ పనుల నిమిత్తం కాగజ్‌నగర్‌కు, కార్యాలయాల పనుల కోసం జిల్లా కేంద్రానికి వెళ్తుంటారు. కొన్ని సందర్భాల్లో చంటి పిల్లలతో కుటుంబ సభ్యులు ఎండలోనే వేచి చూడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. గతంలో కొన్ని చోట్ల బస్టాండ్‌ల నిర్మాణం కోసం పాలకులు భూమిపూజ చేసినప్పటికీ ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. రోడ్లపై నిల్చొని ఉన్నా కనీసం తాగడానికి మంచినీరు సైతం దొరకని పరిస్థితి ఉంది. వర్షాకాలంలో వర్షాలకు తడుచుకుంటూ, చలికాలంలో వణుక్కుంటూ ఉంటున్నారు.

చిగురిస్తున్న ఆశలు..

ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటామని ఇటీవల ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు హామీ ఇవ్వడంతో ఆశలు చిగురిస్తున్నాయి. ఎట్టకేలకు మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణం చేపడతామని ప్రకటించడంతో ఈ ప్రాంతవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నిల్చుందామంటే నీడ లేదు..: అవుత్కార్ లక్ష్మణ్, బెజ్జూరు



బస్సు కోసం నిల్చుందామంటే రోడ్డే గతే... ఎండకు ప్రాణం పోతుంది. చెట్లకింద నిల్చొని కొంచెం ఊపిరి పీల్చుకుంటున్నాం. చిన్నపిల్లల కోసమన్నా కూర్చోడానికి ఏర్పాట్లు చేయాలి. తాగునీరు అందుబాటులో ఉంచాలి.

బస్టాండ్ నిర్మించాలి..: అస్లాం, కుకుడ



ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మండల కేంద్రాల్లో బస్టాండ్‌లు ఏర్పాటు చేయాలి. ఎండ వేడిమి కారణంగా బయట ఉండలేక పోతున్నాం. అధికారులు పట్టించుకోని కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి బస్టాండ్ నిర్మించాలి.

ఎన్నాళ్లీ దుస్థితి..

ఆర్టీసీ ద్వారా ప్రభుత్వానికి కోట్ల ఆదాయం సమకూరుతున్నా సౌకర్యాల కల్పనపై శ్రద్ధ చూపడం లేదని ప్రయా ణికులు వాపోతున్నారు. గతంలో ఆర్టీసీ బస్సు చార్జీలను సైతం గుట్టు చప్పుడు కాకుండా పెంచినా వసతులు మాత్రం ఏర్పాటు చేయడం లేదని మండిపడుతున్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రయాణికుల సౌకర్యార్థం వసతులు, బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, మహిళలకు ఉచితప్రయాణం కల్పించడంతో బస్సుల్లో రద్దీ పెరిగింది. ఉచితప్రయాణం కావడంతో జిల్లాలోని ఆయా మండలాల పరిధిలోని గ్రామాల నుంచి నిత్యం బస్సుల్లో రవాణా విపరీతంగా పెరిగింది. దీనికి తగ్గట్టుగా సౌకర్యాలు లేనికారణంగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

● అదనపు కలెక్టర్ దీపక్ తివారి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, జనవరి 27: జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అదనపుకలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ 2024-25 వార్షికబడ్జెట్ రూపకల్పనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయాల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలన్నారు. పాఠకులు కోరిన పత్రికలు, పుస్తకాలు, పోటీపరీక్షలకు సంబంధించి అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. గ్రామపంచాయతీ, మున్సిపాలిటీల నుంచి వసూలైన గ్రంథాలయ సెస్సు సమర్పించాలని తెలిపారు. జిల్లాలోని గ్రంథాలయాల నిర్వ హణ, జీతభత్యాలు, పారిశుధ్యం, విద్యుత్ చార్జీలు, పుస్తకాలు, దినపత్రికల కొనుగోలు, చెల్లింపులపై వాస్తవిక బడ్జెట్‌లో రూపొందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి మునీశ్వరరావు, జిల్లా విద్యాధికారి అశోక్, జిల్లా పంచాయతీ అధికారి ఉమర్‌హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదును త్వరగా పూర్తిచేయాలి

కెరమెరి: ప్రధానమంత్రి జన్‌ధన్ పథకంలో భాగంగా పీవీటీజీలకు అందించే బ్యాంకుఖాతాల కోసం ఆధార్‌నమోదు ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. శనివారం మండలంలోని కెరమెరి గ్రామ పంచాయతీలో నిర్వహించిన పీవీటీజీల ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి జన్‌ధన్ పథకం ద్వారా జిల్లాలోని పీవీటీజీలు, ఆదివాసులు, గిజనులు లబ్ధి పొందేందుకు బ్యాంకు ఖాతాలు తెరవడానికి ఆధార్‌నమోదు చేస్తున్నామన్నారు. ఈనెల25వరకు 100 మంది ఆధార్ వివరాలు నమోదు చేశామని, శనివారం 40మంది ఆధార్ నమోదు కాగా మిగిలిన వారు ఆధార్ వివరాలు త్వరగా నమోదు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయనవెంట ఎంపీడీవో మహేందర్, కార్యదర్శి భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

‘పది’లో వందశాతం ఫలితాలు సాధించాలి

● గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి



మొక్కలు నాటుతున్న డీడీ రమాదేవి

జైనూర్, జనవరి 27: వచ్చే వార్షికపరీక్షలో పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించి గిరిజన సంక్షేమ శాఖకు మంచిపేరు తీసుకురావాలని డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి కోరారు. స్థానిక బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను ఆమె శనివారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచి కష్టపడి విద్యాభ్యాసం చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, మెనూ ప్రకారం భోజన సదుపాయం కల్పించాలని ఆమె కోరారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను చక్కగా అర్థం చేసుకుంటూ ముందుకుసాగాలని కోరారు. ఉపాధ్యా యులు బోధించిన పాఠాలు అర్థంకాని ఏడల తిరిగి ఉపాధ్యా యులను అడిగి ప్రశ్నలు, సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. అదేవిధంగా సమయానుసారంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు తరగతిగదులకు హాజరుకావాలని సూచించారు. పాఠశాల ఆవరణం పరిశుభ్రంగా ఉంచుకోవా లన్నారు. అనంతరం పాఠశాల ఆవరణంలో డీడీ రమాదేవి సీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతలతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం మండాడి సోనేరావ్, వార్డెన్ గజానంద్ నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సరీలోని పూలతోటల వేలం

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 27: ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని బెల్లంపల్లి ఉద్యాన నర్సరీ(రోజ్‌గార్డెన్)లో సాగు చేస్తున్న చామంతి, బంతిపూల తోటలను వేలం వేయనున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 2న బెల్లంపల్లిలోని ఐటీడీఏ ఉద్యాన నర్సరీలో వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఒక ఎకరం సాగు చేసిన చామంతి, బంతి పూల తోటలను ఒక సీజన్‌కు (మూడు నెలలకు) వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. మిగితా వివరాలకు 9032313933ని సంప్రదించాలన్నారు.

రేపు జడ్పీ సర్వసభ్య సమావేశం

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 27: జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఈనెల29న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని సీఈవో రత్నమాల ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలన్నారు.

గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

సిర్పూర్(టి), జనవరి 27: మండలకేంద్రంలో కూలి పోయిన గ్రంథాలయస్థలంలోనే కొత్త గ్రంథాలయం ఏర్పాటు చేయాలని శనివారం యువకులు, నిరుద్యోగులు తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. పది రోజుల క్రితం ‘ఆంధ్రజ్యోతి’లో కథనం ప్రచురితమైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించడం లేదని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో తహసీల్దార్ స్పందిస్తూ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళతానని పేర్కొన్నారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ

బెజ్జూరు, జనవరి 27: మండలంలోని సలుగుపల్లి గ్రామంలో శనివారం గ్రామస్థులు పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. గ్రామస్థులంతా చందాలు వేసుకొని నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ విమల, పీఏసీఎస్ చైర్మన్ ప్రకాష్, గ్రామస్థులు దిలీప్, రవీందర్‌గౌడ్, తిరుపతి, తిరుపతిగౌడ్, శ్రీకాంత్, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులను తక్షణమే పరిష్కరించాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్, జనవరి 27: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను తక్షణమే పరిష్కరించి బాధితులకు న్యాయంచేయాలని కలెక్టర్ హేమంత్ బొర్కడే అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఎస్పీ సురేష్‌కుమార్‌తో కలిసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో అట్రాసిటీ కేసుల పురోగతిపై త్రైమాసిక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023లో జిల్లాలోని కాగజ్‌నగర్ పోలీసు సబ్‌డివిజనల్ పరిధిలో 14కేసులు, ఆసిఫాబాద్ డివిజన్‌లో 10 కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ కేసులపై విచారణ చర్యలను వేగవంతం చేసి సకాలంలో బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు రాజకీయ ఒత్తిడులకు లోనుకాకుండా విచారణ చేపట్టాలన్నారు. ఎఫ్ఐఆర్ నమోదైన వెంటనే విచారణ దశలో ఉన్న బాధితులకు నిబంధనల మేరకు రూ.25వేల నష్టపరిహారం అందించేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూసమస్యలపై వచ్చే ఫిర్యాదును కమిటీసభ్యులు బాధితులతో వచ్చి నేరుగా తమదృష్టికి తీసుకురావాలని తెలిపారు. జిల్లా ఏర్పడిన నాటినుంచి ఇప్పటివరకు మొత్తం 400మంది బాధితులకు రూ.2.33కోట్ల పరిహారం కిందఅందించామన్నారు. సమావేశంలో జిల్లాషెడ్యూల్డ్ కులాల అభివృద్ధిఅధికారి సజీవన్, డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్, జిల్లాసంక్షేమ శాఖాధికారిణి సావిత్రి, మానిటరింగ్ సభ్యులు కేశవరావు, అశోక్, అర్జు, గోపాల్, గణేష్, గంగుబాయి, వెంకటి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ సబ్‌జైలును సందర్శించిన న్యాయమూర్తి



భోజనశాలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి యువరాజ

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 27: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని స్పెషల్ సబ్‌జైలును శనివారం రీస్టోరింగ్ ద యూత్‌లో భాగంగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ, న్యాయమూర్తి యువరాజ సందర్శించారు. ఈ సందర్భంగా 18 నుంచి 22సంవత్సరాల్లోపు ఉన్న ఖైదీల గుర్తింపు, లీగల్ సర్వీసెస్ అథారటీ యాక్టు, ఫ్రీ లీగల్‌యాడ్, ఖైదీల ఆరోగ్య పరిస్థితులు, భోజనాలను పరిశీలించారు. ఆయనవెంట అసిస్టెట్ లీగల్‌డిఫెన్స్ కౌన్సిల్ అంజనీదేవి, ప్యానల్ అడ్వకేట్‌లు అమృత్‌పాల్ కౌర్, నరహరి, చరణ్‌తేజ, దీరజ్ భౌమిక్, జాదవ్ ఆకాష్, జైలు సూపరింటెండెంట్ ప్రేంకుమార్, ప్యారలీగల్ ఆర్ జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎస్పీ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ సురేష్‌కుమార్

ఆసిఫాబాద్, జనవరి 27: జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో శనివారం పోలీసు క్యాలెండర్‌ను ఎస్పీ సురేష్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ అచ్చేశ్వర్‌రావు, జిల్లాపోలీసుఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయ్ శంకర్‌రెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ స్వామి, జాయింట్ సెక్రెటరీ బిజీమాన్, ఆర్ఐ పెద్దన్న, అంజన్న, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ట్రాక్‌సూట్, కిట్ అందజేత



విద్యార్థులతో డీఈవో అశోక్

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 27: ఈనెల31నుంచి ఫిబ్రవరి 4వరకు జార్ఖండ్‌లో జరిగే అండర్-14 బాలబాలికల జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో తెలంగాణ జట్టులో పాల్గొనున్న విద్యార్థులకు శనివారం డీఈవో ట్రాక్‌సూట్, కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పాఠశాలల క్రీడలసమైక్య ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, డీడీ రమాదేవి, మీనారెడ్డి, ఏసీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, ఏటీడీవో క్షేత్రయ్య, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు, పూర్ణచందర్, పీడీ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పెర్సాపెన్ ఉత్సవాలు

సిర్పూర్(యు), జనవరి 27: మండలకేంద్రంలోని ఖాతీగూడలో సెడ్మకి వంశీయుల పెర్సాపెన్ ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతున్నట్లు ఆ వంశీయుల కులగురువు సెడ్మకి గంగు (కటోడ) తెలిపారు. శనివారం ఖాతీగూడ సత్తీక్ దేవుడి ఆలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 28న పెర్సాపెన్ ఉత్సవాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 29నపెద్దదేవుడి ఊరేగింపు, 30నగంగా జలాభిషేకంతో పాటు మహాపూజ కార్యక్రమం ఉంటుందన్నారు. ఫిబ్రవరి 1న సెడ్మకి వశీయులు తమ స్వగ్రామాలకు తిరుగుప్రయణం చేస్తారు. కార్యక్రమానికి జయప్రదం చేయాలని ఆయన కోరారు.



నేడు సింగరేణి అధికారుల సంఘం ఎన్నికలు

శ్రీరాంపూర్/మందమర్రిటౌన్, జనవరి 27: కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేన్ ఆఫ్ ఇండియా(సీఎంఓఏఐ) సింగరేణిబ్రాంచ్ ఎన్నికలు ఆదివారం జరుగనున్నాయి. సింగరేణి బ్రాంచ్(కంపెనీ)వ్యాప్తంగా మొత్తం 2300మంది ఓటర్లు ఉండగా, శ్రీరాంపూర్ ఏరియాలో 217మంది ఉన్నారు. అధికారులు 12 (11ఏరియాలతోపాటు ఎస్‌టీపీపీఅదనం) ఏరియాల్లో తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఏరియాస్థాయిలో ప్రెసిడెంట్, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షుడు-1, ఉపాధ్యక్షుడు-2, జాయింట్‌సెక్రెటరీ-1, జాయింట్ సెక్రెటరీ-2, ట్రెజరర్, జాయింట్‌ట్రెజరర్(ఎనిమిది) పోస్టులుండగా, బ్రాంచ్ స్థాయిలో కూడా అదే మాదిరిగా ఎనిమిది పోస్టులున్నాయి. అంటే ఒక్కో ఓటరు(అధికారి) మొత్తం 16ఓట్లు వేయనున్నారు. ఆర్కే5 గ్రూపుఏజెంటు అనుమల్ల వెంకటేశ్వర్‌రెడ్డి, మణుగూరు పీవో లక్ష్మీపతిగౌడ్, ఆర్జీ ఓసీపీ పీవో రాధాకృష్ణ, ఎస్ఆర్‌పీ3 గ్రూపుఏజెంటు గోపాల్‌సింగ్, కొత్తగూడెం గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్, కొత్తగూడెం జీకే ఓసీ ఎస్ఈ కృష్ణప్రసాద్ అధ్యక్షుల బరిలో ఉన్నారు. ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సంఘం ప్రారంభించిన నాటినుంచి అయాపదవుల్లో అనుమల్ల వెంకటేశ్వర్ రెడ్డి పనిచేశారు. అన్నిఏరియాల్లో ఉన్న సింగరేణి అధికారుల క్లబ్‌లలో శనివారం ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటలకు వరకు పోలింగ్, ఆ తదుపరి లెక్కింపు ప్రారంభమవుతుంది. తుది ఫలితాల ప్రకటన 29న ఉంటుంది. ఎన్నికైన వారికి 30న ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు : జీఎం

మందమర్రిటౌన్: సింగరేణి అధికారుల సంఘం ఎన్నికలు ఆదివారం జరగనున్న దృష్ట్యా ఎన్నికల ఏర్పాట్లను పకడ్బందీగా చేశామని మందమర్రి జీఎం మనోహర్ తెలిపారు. శనివారం జీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఓటరులిస్టు కూడా సిద్ధం చేశామన్నారు. ప్రశాంతంగా ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కాగా కొత్తగూడెం కార్పొరేట్ సేఫ్టీజీఎం గురవయ్య వీడియోకాన్ఫరెన్స్‌ద్వారా అధికారులకు ఎన్నికలకు సంబంధించి సూచనలుచేశారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని, పోలింగ్ కేంద్రాల్లో వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏఎస్‌వో రవీందర్, పీఎం శ్యాంసుందర్ పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

మందమర్రిటౌన్, జనవరి 27: మందమర్రి ఏరియాలోని కేకే5 గని రోడ్డు పనులను శనివారం సివిల్ డిపార్టుమెంట్ ఎస్‌ఈ జయప్రకాష్, కేకే5 గని మేనేజర్ భూశంకరయ్య, సివిల్ సూపర్‌వైజర్ రాంవెంకటేశ్వర్లు పరిశీలించారు. పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

నియామక పత్రాలను వెంటనే అందించాలి



వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

శ్రీరాంపూర్, జనవరి 27: కార్పొరేట్ మెడికల్ బోర్డు ద్వారా అన్‌ఫిట్ అయిన సింగరేణి ఉద్యోగుల పిల్లలకు, ఎక్స్‌టర్నల్ విధానంలో నియామకం అయిన యువతకు ఉద్యోగ నియామకపత్రాలు వెంటనే అందించాలని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు కె వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, ఏరియాకార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా కోరారు. ఈ మేరకు వారు శనివారం జీఎం కార్యాలయంలో పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ, సాధారణ ఎన్నికల, సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా సుమారు 600మంది యువతీ యువకులకు నియామకాలు ఆలస్యం అయ్యాయని తెలిపారు. వారంతా నియామకపత్రాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. మరికొన్ని రోజుల్లో పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని, దీనితో మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ ఎన్నికల కోడ్ రాక ముందే మెడికల్ వారికి వెంటనే నియామకపత్రాలు అందించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి మారేపల్లి సారయ్య, గండి సతీష్, బద్రి బుచ్చయ్య, సదానందం, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, రాజ్‌కుమార్, వంశీకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

కార్మికుల ఆరు గ్యారంటీలు అమలు చేయిస్తాం

మందమర్రిటౌన్, జనవరి 27: సింగరేణిలో గుర్తింపుసంఘం ఎన్నికల ముందు తమ యూనియన్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను తప్పకుండా అమలు చేస్తామని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ కాంపల్లి సమ్మయ్య తెలిపారు. శనివారం మందమర్రిలో మాట్లాడుతూ కొద్దిపాటి ఓట్లతో గుర్తింపు సంఘం హోదాను కోల్పోయామని, అయినప్పటికీ రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున సీఎం దృష్టికి తీసుకువెళ్లి కార్మికులసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

రెబ్బెన, జనవరి 27: సింగరేణి ఉద్యోగ క్రీడాకారులకు శనివారం గోలేటి సీఈఆర్ క్లబ్‌లో జీఎం రవి ప్రసాద్ క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడల్లో చక్కగా రాణించి సింగరేణికి మంచిపేరు తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ఎస్‌వోటు జీఎం నరేందర్, పీఎం రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్, పీవో ప్రశాంత్, బెల్లంపల్లి ఏరియాస్పోర్ట్స్ కోఆర్డినేటర్ మురహరి రావు, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్ పాల్గొన్నారు.

డిపెండెంట్‌లను వెంటనే ఉద్యోగాల్లోకి తీసుకోవాలి



జీఎంకు వినతి పత్రం ఇస్తున్న గుర్తింపు నాయకులు

మందమర్రిటౌన్, జనవరి 27: మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన డిపెండెంట్ల పిల్లలకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని శనివారం మందమర్రి జీఎం మనోహర్‌కు గుర్తింపు సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గుర్తిం పు సంఘం బ్రాంచికార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ మాట్లాడుతూ సింగరేణిలో అనారోగ్యంతో చాలామంది ఉద్యోగులు మెడికల్ ఇన్వాడిలేషన్ అవుతున్నారని, నెలలు గడుస్తున్నా వారి పిల్లలను ఉద్యోగాల్లోకి తీసుకోకపోవడంతో కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. వెంటనే డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కార్యక్ర మంలో గుర్తింపు సంఘం నాయకులు చిప్ప నర్సయ్య, దాగం మల్లేష్, కంది శ్రీనివాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.